



## జరిగిన జగన్నాటకం

ఎడమ చేతిని ప్రముఖంగా వాడే సవ్యలంకలో కుడిచేతి పోరాటానికి మహాబసు అనే నాయకుడయ్యాడు బోసు. మరణదండన నుంచి ద్వీప, ఆచార్య వేదాంతం కాపాడారు. రెండుసార్లు దళాధిపతి దాడి నుంచి ఉగ్ర కాపాడాడు. వామదేవుడి గూఢచారి ఉదంతుడు పోరాటంలో చేరాడు. మహాబసుగా తన అనుభవాలన్నింటినీ డా. నరసింహంకి చెప్తుంటాడు సారథి. పేరలల్ వరల్డ్స్ లో ప్రయాణం వల్ల సారథి సవ్యలంకకి వెళ్ళాడని డా. నరసింహం తెలుసుకున్నాడు. వర్తకులతో చర్చలకు వెళ్ళిన మహాబసుపై దాడి చేశాడు దళాధిపతి. సుధాముడు మరణించాడు. ఉదంతుడు మహాబసుని రహస్య మార్గం ద్వారా బయటికి తీసుకెళ్ళిపోయాడు.

# - 21 –

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

"సమ్రాట్ అశోక చక్రవర్తి"

పేరు పిలిస్తున్నప్పుడే మహబసు ముఖంలో ఆశ్చర్యం ఆనందం కలగలిసిపోయాయి.

"మీ కోసమే చూస్తున్నాను" అన్నాడు.

"నేనేం చేస్తానని?" అశోకుడి ముఖంలో ఆనందం లేదు.

"మీలాంటి మహానుభావుల దర్శనం అయినప్పుడల్లా నాకు దిశానిర్దేశ్యం జరుగుతుంది. నేనేం చెయ్యాలో, ఎలా చెయ్యాలో మార్గం తెలుస్తుండి. మీరు వచ్చారు కాబట్టి ఇప్పుడు నేను ఏం చెయ్యాలో తెలుస్తుందని అనుకుంటున్నాను" బోసు మాటలకు అశోకుడు విషాదంగా నవ్వాడు.

"మనం కొంత కాలం క్రితం కలిశాము కదా. అప్పుడు నేను చెప్పిన మాటలు గుర్తున్నాయా? నేను చూపించిన మార్గంలోనే ముందుకు వెళ్ళావా?"

"సమ్రాట్! మీరు మునుపు దర్శనం ఇచ్చినప్పుడు ఏదీ స్పష్టంగా చెప్పలేదు. యుద్ధం అంటే విషాదం అన్నారు. విలాపం అన్నారు. నాకు పూర్తిగా అర్థం అయ్యేలోపలే అంతర్ధానమయ్యారు" ఇది వింటూనే నవ్వాడు అశోకుడు.

"స్పష్టంగా చెప్పడానికి నాకు కూడా అంతే స్పష్టమైన అవగాహన వుండాలి కదా? నేనే తెలుసుకునే ప్రయత్నంలో వున్నాను." చిరునవ్వుతో చెప్పాడాయన.

"అదేమిటి సమ్రాట్?" ఆశ్చర్యంగా అడిగాడు బోసు.

"ప్రపంచంలో వున్నదేదీ స్పష్టంగా వుండదు కదా. అన్నీ నలుపు తెలుపు రంగులలో వుంటే అర్థం చేసుకోవడం, మంచి చెడులను బేరీజు వేసుకోవడం సులభమయ్యేది. నీకు నేనేదో నేర్పించడానికి వచ్చానని నువ్వు అనుకుంటున్నావు కానీ నిజం చెప్పాలంటే నేనే ఏదో నేర్చుకోడానికి అవకాశం వుంటుందేమోనని నిన్ను కలుస్తున్నాను." అంటూ ఒక్క క్షణం ఆగి – "సరే చెప్పు ఏ విషయంలో నీకు సహాయం కావాలి?" అడిగాడాయన.

"సమ్రాట్, గతంలో మీరు చెప్పారు. యుద్ధం విషాదమని, విలాపని. ఇప్పుడు నేను వున్న పరిస్థితిలో ఏ క్షణమైనా యుద్ధం మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. అటు వామదేవుడు ఎలాగైనా మా పోరాటాన్ని అణిచివేయాలని చూస్తున్నాడు. ఇటు మా పోరాటయోధులు తాడో పేడో తేల్చేసుకోవాలని దూకుడు మీద వున్నారు. ఇలాంటి సందర్భంలో మీరు కనపడితే ఏ యుద్ధం తంత్రమో నేర్పుతారు అనుకున్నా. కానీ మీరు చెప్పిందేమో వేదాంతం. యుద్ధం విషాదమన్న వేదాంతం. నన్ను ఇప్పుడు ఏం చెయ్యమంటారు?" అడిగాడు మహాబసు.

కొంతసేపు ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదు అశోకుడు. ఆ తరువాత చాలా నెమ్మదిగా అడిగాడు

"భగవద్గీత చదివావా?"

"చదివాను సమ్రాట్"

"అయితే అందులో ఏముంటుందో చెప్పగలవా?"

"చాలా విషయాలు వున్నాయి. మొత్తం మీద చూడాలంటే అర్జునుడు యుద్ధం చెయ్యడానికి వెనకాడుతుంటే అతన్ని యుద్ధం చెయ్యడానికి సుముఖుడిగా తయారు చెయ్యటమే భగవద్గీత ఉద్దేశ్యం. అందులో భాగంగా మొదట అర్జునుడు తన విషాదాన్ని చెప్తాడు. యుద్ధం చెయ్యలేనని అనాసక్తి తెలియజేస్తాడు. కృష్ణుడు అర్జునుణ్ణి యుద్ధోన్ముఖుణ్ణి చేసేందుకు మొదట క్షత్రియ ధర్మం గురించి చెప్తాడు. ఒక క్షత్రియుడిగా అర్జునుడు ధర్మస్థాపన కోసం యుద్ధం చేసి తీరాలని చెప్పాడు. చంపడానికి వెనుకాడుతుంటే చావు పుట్టుకల గురించి చెప్పి దేవుడిగా తను చంపుతుంటే అర్జునుడు కేవలం నిమిత్తమాత్రుడై నిలబడ్డాడని గుర్తు చేస్తాడు. కర్మ చెయ్యడం ఎంత అవసరమో చెప్పి, కర్మ ఫలితాలు మాత్రం ఆశించకూడదన్నాడు. జనన మరణాలు, ఆత్మ శాశ్వతత్వం

చెప్పి యుద్ధంలో మనుషుల్ని చంపడం కేవలం శరీరాన్ని ఆత్మని వేరు చెయ్యడమే తప్ప, అర్జునుడు చేస్తున్నది హత్యకాదని నిరూపించాడు కృష్ణుడు. ఇవి కాక మోక్షమార్గాలు కూడా చెప్పాడాయన"

"చాలా బాగా చెప్పావు మిత్రమా. ఈ భగవద్గీత చెప్పిన తరువాత దాని పర్యవసానం ఏమిటో చెప్పు"

"ఏదైతే కృష్ణుడు కోరుకున్నాడో అదే జరిగింది. అర్జునుడు యుద్ధం చెయ్యడానికి సిద్ధపడ్డాడు. ఆ తరువాత జరిగిందే కురుక్షేత్ర మహా సంగ్రామం."

"ఎంత మంది మరణించి వుంటారు" అనుకోని ప్రశ్నకి తడబడ్డాడు మహాబసు.

"అటు కలిపి పద్దెనిమిది అక్షౌహిణుల సైన్యం యుద్ధం చేశారని తెలుసు. అంటే సుమారు నలభై లక్షలమంది యుద్ధం చేసారు. కనీసం ముప్ఫై లక్షలమంది పైనా చనిపోయారని అంచనా వేయచ్చు."

"అది కేవలం మనుషుల లెక్క. రాక్షస జాతుల వంటి వాళ్ళు, గుర్రాలు, ఏనుగులు, ఒంటెలు. వీటన్నింటి లెక్కగడితే మిగిలేదేంటి? శవాల గుట్ట. ఇదే కదా అర్జునుడు సాధించింది. ఇదే కదా శ్రీకృష్ణుడు చూపించిన మార్గంలో చేరుకున్న గమ్యం?"

"అవును"

"సరిగ్గా ఇలాంటి పరిస్థితే నాకు కూడా ఎదురైంది. నేను కూడా ఒకసారి అలాంటి గమ్యానికే చేరుకున్నాను. క్షత్రియుడిగా, పాలకుడిగా నా ధర్మం యుద్ధం అని నమ్మాను. శ్రీకృష్ణుణ్ణి నమ్మాను. గీతలో అర్జునుడికి చేసిన ఉపదేశం ప్రకారం ఎన్నో యుద్ధాలు చేశాను. కానీ ఆ ఒక్క ఇద్ధం వేరే. నా జీత పథాన్ని మరో వైపుకి తిప్పిన యుద్ధం – కళింగ యుద్ధం. తల్చుకున్న ప్రతిసారీ నాలోని అణువణువు అపరాధభావంతో, నాపైన నాకే కలిగే అసహ్యాభావనతో రగిలిపోయే మారణహోమం. ఏం సాధించాను? ఎందరో తల్లుల హృదయవేదన. ఎందరో భార్యల ఆక్రదన. విలాపం. విషాదం."

"నిజమే సామ్రాట్. ఆ తరువాత మీరు యుద్ధాలు మానేసి శాంతి కాముకులై..."

"జరగాల్సిందంతా జరిగిపోయాక ఏం చేస్తే ఏం లాభం మహాబసూ. నేను ఆ తరువాత ఏమయ్యానన్నది కాదు ప్రశ్న. అలాంటి యుద్ధం జరగకుండా ఏం చెయ్యగలుగుతున్నాన్నది ప్రశ్న. మనం ఇందాక చెప్పుకున్న భగవద్గీతనే తీసుకో – మొదలయ్యేది అర్జున విషాదయోగంతో. ఆ భగవద్గీతలో చెప్పినట్లుగానే కర్తవ్యపాలన చేసి, క్షత్రియుడిగా యుద్ధం చేస్తే చివరకు నాకు మిగిలిందేమిటి? శవాల సామ్రాజ్యం. మళ్ళీ విషాదం. అన్ని హత్యలకు కారణమయ్యానన్న అపరాధభావం. నా జీవితంలో గీతామార్గం సాధించిందేమిటి అని నన్ను నేను ప్రశ్నించుకుంటే కనపడేదేమిటో తెలుసా? విషాదం నుంచి విషాదానికి ఒక నెత్తుటి దారి పరిచింది."

"నిజమే సమ్రాట్. మరి కురుక్షేత్ర సంగ్రామం తరువాత అర్జునుడు కూడా ఇలాంటి విషాదానికి లోనై వుండడా?"

"అలా జరగలేదని మాత్రం ఖచ్చితంగా చెప్పలేను. శ్రీకృష్ణుడు వైరాగ్యాన్ని బోధించాడు కదా అని అర్జునుడు తాను చంపుతున్నది శరీరాలనే, ఆత్మలు శాశ్వతాలు అనుకోని వుంటాడని ఊహించలేము. ఎంతటి మహావీరుడికైనా ఒక వ్యక్తి మరణానికి కారణమౌతున్నానన్న భావన భరించడం కష్టమే. అలా అనుకోగలిగితే ద్రోణుడి మరణానికి, భీష్ముడి మరణానికి విలపించేవాడు కాదు. అభిమన్యుడి చావుకి ప్రతీకారం చేస్తానని ప్రతిజ్ఞలు చేసేవాడు కాదు. అంతటి స్థితప్రజ్ఞత, వైరాగ్యజ్ఞానం సాధించగలిగితే అర్జునుడైనా, నేనైనా యుద్ధాలు రాచరికాలు వదిలేసి సాధు జీవితాన్ని గడిపేవాళ్ళం."

"మరైతే యుద్ధం సాధించేదేమిటి?"

"ఆ ప్రశ్నకు సమాధానం కోసమే నేను కూడా వెతుకుతున్నాను. ఎక్కడ యుద్ధం జరిగితే అక్కడికి వెళ్తాను. ఇంత వరకు నా ప్రశ్నకు సమాధానం దొరకలేదు. కానీ చూసిన ప్రతిసారి నా గుండెలు బ్రద్దలయ్యే వినాశనాన్ని, మారణకాండలను చూస్తున్నాను."

"అయితే నన్ను యుద్ధం చెయ్యద్దని చెప్తున్నారా?"

"నేనేమీ చెప్పటం లేదు. యుద్ధం అంటూ జరిగితే దాని పర్యవసానం ఏమిటో తెలుసుకోమని హెచ్చరిస్తున్నాను. ధర్మపక్షం వహించడం తప్పు కాదు. ధర్మం కోసం యుద్ధం చెయ్యాల్సి వస్తే చెయ్యడం కూడా అవసరమే. నాయకుడిగా నీకు కొన్ని బాధ్యతలు వున్నాయి. నీ శత్రువు వామదేవుడికి కూడా కొన్ని బాధ్యతలు వుంటాయి. మీ మీ బాధ్యతల మధ్య వున్న స్పర్థలే కదా చాలా వరకు పోరాటాలకి కారణం,

అదలా వుంచు. నిన్ను నమ్ముకోని నిన్ను అనుగమిస్తున్న వారికి నీ పైన ఆశలు వుంటాయి కదా. అలానే వామదేవుడి సైన్యం అతని పైన ఆశలు పెట్టుకోని వుంటారు. మీ ఇద్దరూ మీ మీద ఇతరులు పెట్టుకున్న ఆశలని మీ ఆశయం అనుకుంటున్నారు. మీ బాధ్యతలను, ఆశయాలను కలిపి చూసుకోని అదే మీ మీ ధర్మం అనుకుంటున్నారు. నిజానికి నీ ధర్మం, నీ శత్రువు ధర్మం అంటూ రెండు రకాల ధర్మాలు వుండవు. ధర్మం ఎప్పుడూ ఒకటే. అదే నిత్యము. అదే సత్యము."

"మా ఇద్దరికీ అనూనయమైన ఒకటే సత్యము వుందా? అదేమిటి?"

అశోకుడు ఏదో చెప్తున్నాడు కానీ అతని మాటలు బయటికి వినిపించడం లేదు. ఆయన రూపం క్రమక్రమంగా మాయమైపోయింది. అశోకుడు అదృశ్యమైతున్న కొద్దీ మహాబసు తల ఏదో బాధ మొదలైంది. చిన్న నొప్పిలా మొదలై తల మొత్తం వ్యాపించింది.

<★>

తమ శిబిరానికి చేరేవరకు ఎవరూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. చనిపోయిన సుధాముడికి చేయవలసిన అంత్యక్రియలు ఆచార్య వేదాంతం ఆధ్వర్యంలో పూర్తి చేశాడు ఉగ్ర. సుధాముడి ఆనవాళ్ళతో పాటు అక్కడున్నవాళ్ళందరిలో మాటలు కూడా మాయమైనట్లుగా వుందక్కడి పరిస్థితి. అందరికన్నా ముందు మాట్లాడింది ద్వీప.

"ఈ పోరాటాన్ని ఇక్కడితో ఆపేయండి" అంది ఆవేశంగా.

ఆమె వైపు అందరూ ఆశ్చర్యంగా చూశారు. మహాబసు అంటే ఎంత గౌరవమో, ద్వీప అన్నా కూడా అంతే గౌరవం అందరికీ. పెళ్ళికాలేదన్నమాటే కానీ ఆమెను మహాబసు అర్ధాంగిగానే చూశారు అందరు. అలాంటి వ్యక్తి పోరాటాన్ని ఆపేయమనడం అందరూ ఆశ్చర్యపోయారు. ఆ క్షణం దాకా నమ్ముకున్న సిద్ధాంతాలనీ, మహాబసుపైన విశ్వాసాన్ని వదిలేయమని చెప్తుంటే నమ్మలేకపోయారు. అయితే మహాబసు ఏమయ్యాడో తెలియని అయోమయంలో, అతనికి దూరమైన విషాదంలో ఆమె ఏం మాట్లోడుతోందో ఆమెకే తెలియదు అని సర్ది చెప్పుకున్నారు. విషయం అర్థం చేసుకున్న ఆచార్య వేదాంతం ఆమె దగ్గరకు వచ్చాడు.

"ద్వీపా! నువ్వు ఏం మాట్లాడుతున్నావో అర్థమౌతోందా? మహాబసుకి ఏం కాదు. నువ్వు ధైర్యంగా వుండు" అన్నాడు అనూనయంగా.

"ఎలా వుండమంటారు ఆచార్యా? ఆయన ఏమయ్యాడో తెలియదు. బంధించారో? లేక వధించారో? సారథ్యం లేకుండా ముందుకు ఎలా వెళ్ళగలం? అందుకే ఈ పోరాటాన్ని ఆపేయమంటున్నాను" బాధపడుతూనే చెప్పింది ద్వీప. ఉగ్ర ఆ మాటలు వింటూనే కోపంగా ముందుకు వచ్చాడు.

"నాయకత్వం లేదన్నమాట నేను అంగీకరించను ద్వీపా! మహాబసు ఈ ద్వీపానికి రాకముందు నుంచే ఇక్కడ పోరాటం జరుగుతూ వుంది. అతని రాకతో మనం బలం పెరిగింది. వెళ్ళాల్సిన దారి తెలిసింది. ఇప్పుడు మళ్ళీ మనమే మిగిలాం. మన పోరాటం మనమే చేసుకుందాం. మనలోనే ఒకరు నాయకత్వం వహిస్తాం అంతే కదా. దానికి పోరాటాన్ని ఆపడం ఎందుకు?" అన్నాడు ఉగ్ర.

ద్వీప బాధ మొత్తం ఒక్కసారి కోపంగా మారిపోయినట్లు ఊగిపోయింది. విసురుగా ముందుకు వచ్చింది.

"దుర్మార్గుడా! పదవి కోసం, అధికారం కోసం మాట్లాడుతున్నావు. మహాబసు లేదంటే తరువాత నాయకుడివి నువ్వే కాబట్టి ఆ స్వార్థంతో ఈ పోరాటం కొనసాగాలని కోరుకుంటున్నావు" అన్నదామె.

ఆమె దురుసు మాటలకు ఉగ్ర ఏ మాత్రం తొణకలేదు. ఆచార్య వేదాంతం మాత్రం ఆశ్చర్యపోయాడు. కొంత బాధ కూడా కలిగింది. బహుశా ద్వీప ఆయన శిష్యురాలు కావటం వల్లమో అతని బాధ మరింత ఎక్కువగా వుంది.

"అమ్మా ద్వీపా! నువ్వు ఆవేశంలో మాట్లాడుతున్నావు" అన్నాడు చివరకు.

"లేదు ఆచార్యా. ఎంతో ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నాను." వివరించింది ద్వీప.

"ఏమిటి ఆలోచించింది?" విరుచుకుపడ్డాడు ఉగ్ర "ఇన్ని తరాల ఆశయాన్ని వదిలేసుకోమంటున్నావు. ఇన్ని వేలమంది ఆశలను మర్చిపోదామంటున్నావు. అదీ ఎందుకు అంటే నువ్వు ప్రేమించి, నువ్వు పెళ్ళి చేసుకోవాలని అనుకున్న మనిషి లేకుండాపోయాడని. ఇది స్వార్థం కాదా? అధికారం కోసం నేను ఇదంతా చేస్తున్నానని నువ్వు నన్ను ఆక్షేపించావు. అలా అయితే నువ్వు చేస్తున్నదేమిటి? అధికారం అందుకోడానికి నీకు ఆప్తుడైనవాడు లేదని పోరాటాన్నే ఆపేయమని అడుగుతున్నావు" సౌమ్యంగానే చెప్పాడు ఉగ్ర.

"ఉగ్రా" అంటూ అరిచింది ద్వీప. "నేను చెప్పిన విషయాన్ని వక్రమార్గంలో చూడకు. అధికారంలో నాకు ఆప్తుడైన మహాబసే వుండాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. నాకు కావాల్సింది మహాబసే కానీ అతనితోపాటు వచ్చే అధికారం కాదు. నేను కూడా మీతోపాటు ఇదే ఆశయాన్ని పంచుకున్న విషయం మర్చిపోవద్దు. నేను అన్ని రకాలుగా ఆలోచించాను. నాకు పోరాటాన్ని ఆపేయడం కన్నా మార్గం తోచడం లేదు ఉగ్రా! మహాబసు నాయకుడిగా లేడన్న విషయం మన సైనికులకు తెలిసిన మరుక్షణం ఏమౌతుందా అని ఆలోచించాను. మహాబసు లేకపోతే మనం తల లేని మెండెంలా మిగిలిపోతాము. అలాంటి పరిస్థితిలో యుద్ధం చెయ్యగల సత్త మనలో వున్నదా అన్నదే ప్రశ్న" ద్వీప చెప్పింది.

"నువ్వు చెప్పింది కొంత వరకు నిజమే కావచ్చు, కానీ, ఇప్పటి దాకా చేసిన పోరాటాన్ని ఉన్నట్టుండి ఆపేస్తే ఏమౌతుందో ఆలోచించావా? ఎక్కడ్నుంచి ఈ పోరాటాన్ని మొదలుపెట్టామో అంతకన్నా వెనక్కి వెళ్ళిపోతాం మనం. ఇంతకాలం ప్రభుత్వానికి వ్యతిరేకం నడిచిన మనందరం బందీలమో, బలులమో అవుతాం. భావి తరాలు మళ్ళీ అదే బానిస బతుకులోకి నెట్టివేయబడతాయి. ఈ జీవితంలో ఏం సాధించావ్? అంటే సిగ్గు మరచి దాదాపు విజయం అంచులకు చేరుకున్న పోరాటాన్ని మధ్యలో వదిలేశామని చెప్పుకు బ్రతకడం నాకు ఇష్టం లేదు. పోరాటం కొనసాగాల్సిందే. ఒకవేళ నేను నాయకుడిగా వుండటమే దానికి అభ్యంతరమయితే వేరే ఎవరినైనా నాయకుడిగా పెట్టుకోండి. అసలు నాయకుడే లేకపోయినా ఫర్వాలేదు. నాతో వచ్చే వాళ్ళే రండి. మన ఆశయాన్ని నమ్మినవాళ్ళే నాతో వుండండి" కోపంగా అరిచి మరీ చెప్పాడు ఉగ్ర.

ద్వీప సమాధానం చెప్పబోయి ఆగిపోయింది. ఆమె మనసులో ఉగ్ర ప్రశ్నలే తిరుగుతోంది. మనసు మహాబసు కోసం అన్నీ వదిలేయమంటోంది. మెదడు పోరాటాన్ని కొనసాగించమని చెప్తోంది. ఆమె కంట్లో నుంచి కన్నీళ్ళు జలజలా రాలాయి. పరిస్థితిని అర్థం చేసుకున్న ఆచార్య వేదాంతం ద్వీప దగ్గరగా వచ్చి తలపై చెయ్యి వేసి నిమిరాడు.

"మహాబసుకి ఏం కాదు. మనం భయపడాల్సిన అవసరం లేదు. ఆయనే మహాబసు అని మనం నమ్మినది నిజమే అయితే ఆయన వివాహం కూడా సవ్యలంకలోనే జరగాలి. అది మనం నమ్మాలి. ముఖ్యంగా నువ్వు నమ్మాలి. ఆ నమ్మకమే సాక్ష్యం ఆయనకు ఏం కాలేదనడానికి. మీ ఇద్దరినీ కలిపే బాధ్యత నాది. సరేనా?" అన్నాడు. ద్వీప తలాడించి చిన్నగా నవ్వింది.

అయితే ఆ ఆనందం క్షణం కూడా నిలవలేదు.

"మహాబసుని చంపేశారు" అరుస్తూ వచ్చాడు ఓ సైనికుడు. వేదాంతం నమ్మలేనట్లు చూశాడు. ద్వీప కుప్పకూలిపోయింది. ఉగ్ర ఒక్కడే స్థిరంగా నిలబడి – "ఎవరు చెప్పారు? నువ్వు చూశావా?" అన్నాడు గట్టిగా.

"లేదు నాయకా. నేను కళ్ళారా చూడలేదు. దక్షిణావతం మొత్తం కోడై కూస్తోంది. విన్నదే విన్నవించుకున్నాను" అన్నాడతను.

"అవును ప్రభూ. అది చెప్పాలనే వస్తున్నా" మరో వ్యక్తి ఇంకో వైపు నుంచి దూసుకొచ్చాడు.

"విన్నావా? కన్నావా?" మళ్ళీ అడిగాడు ఉగ్ర.

"విన్నదే విన్నవించుకుంటున్నాను దేవరా" ఒక్క క్షణం ఆగి మళ్ళీ కొనసాగించాడు ఆ వ్యక్తి. "అంతే కాదు దేవరా, వామదేవుడు యుద్ధానికి సన్నద్ధం అవుతున్నాడని తెలుస్తోంది"

ఉగ్ర చాతి ఉప్పొంగేలా గట్టిగా శ్వాస తీసుకున్నాడు. బోసు మరణం నిజమేనా? తొలుస్తున్న ప్రశ్నకు సమాధానం ఆలోచిస్తున్నాడతను. మరో వైపు వామదేవుడి యుద్ధ ప్రయత్నాన్ని ఎదిరించడం ఎలా? అని కూడా ఆలోచిస్తున్నాడు.

(జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS